# 6. హితోక్తులు

**పాఠంలోకి ప్రవేశించేముందు:**

- ''పొగడ్తలకు పొంగరాదు - తెగడ్తలకు కుంగరాదు'' - అను లోకోక్తికి అర్థం ఏమిటి? చర్చించండి.
- ''సమయం మీ మాట వింటే?....... మీరేం చేస్తారు?'' - ఊహించి చెప్పండి.

ఇప్పుడు లక్ష్మీనారాయణ గురువు గారు మన హితంకోరి ఏమి చెబుతున్నారో చూద్దామా!

**1.** **పొంగరు జయమును బొందిన,**
**కుంగ రపజయమ్ము చేత గుణవంతు లిలన్,**
**లొంగరు పనిసాధించక,**
**సంగటి దుర్జనులతోడసలుపరు ఛాత్రా!**



**3.** **మనమున దృఢ సంకల్పము,**
**వెను దిరగని విమల యాత్మ విశ్వాసంబున్,**
**అనిశము కార్యాసక్తియు**
**నొనరిన వారలకు ఫలితముండును ఛాత్రా!**



**5.** **పాటించుము క్రమశిక్షణ**
**చోటివ్వక ననియమములకు సుంతైన సుమీ**
**దీటగు గుణ సంపదలకు**
**బాటది, సంస్కారమునకు భద్రము ఛాత్రా!**



**2.** **జంకక దృఢ చిత్తముతో**
**సంకటముల కెదురు నిలువ సహనము తోడన్,**
**సంకల్పము సిద్ధించును,**
**సంకోచంబున్న విడువు సరగున ఛాత్రా!**



**4.** **కాలమ్మాగదు నీకై**
**చాలా విలువైనదదియు సాగుము వడిగా**
**జాలము చేసిన జీవన**
**కాలము నిష్ఫలము జెందు గనుమా ఛాత్రా!**



## I. వినండి-సంభాషించండి.

1. మీరు చదివిన కొన్ని శతకాల పేర్లు చెప్పండి.
2. శతకం అంటే ఏమిటి?
3. హితము అంటే ఏమిటి?

## II. చదవండి-ఆలోచించండి-రాయండి.

### అ. పదజాలం పెంపొందించుకుందాం- భావాలు నేర్చుకుందాం.

1. పొంగరు = ఆనందింపరు; ఇల = భూమి; కుంగరు = విచారింపరు; సంగటి = స్నేహము; దుర్జనులు = చెడ్డవారు; ఛాత్రులు = విద్యార్థులు

   **భావం:** మంచి గుణాలు కలవారు తమకు జయం లభించినపుడు అమితంగా ఆనందింపరు. అపజయం కలిగినపుడు విచారింపరు. తాము తలపెట్టిన కార్యం పూర్తి అగువరకు వదిలిపెట్టరు. చెడ్డవారితో స్నేహం చేయరు.

2. జంకు = భయం; చిత్తము = మనసు; సంకటము = కష్టము; సంకల్పము = తలచిన కార్యము; సరగున = వెంటనే

   **భావం:** కష్టాలు ఎదురైనపుడు దృఢ చిత్తంతో ఏ మాత్రం భయపడక వాటిని ఎదుర్కొనవలెను. అట్లు చేసినచో తలచిన కార్యాలన్నీ తప్పక నెరవేరును. దీనిలో ఎట్టి అనుమానం తగదు.

3. విమల = స్వచ్ఛమైన; అనిశము = ఎల్లప్పుడు; ఆసక్తి = కోరిక.

   **భావం:** మనస్సులో దృఢనిశ్చయము కలిగి వుండవలెను. చేయుచున్న పని యందు ఆసక్తి కలిగి ఆత్మవిశ్వాసంతో వెనుకంజ వేయకుండా ప్రయత్నించువారికి ఫలితం లభించును.

4. వడి = వేగం; జాలము = ఆలస్యం, నిష్ఫలము = వ్యర్థం.

   **భావం:** కాలం చాలా విలువైనది. ఎవరి కోసమూ ఆగదు. కనుక కాలంతో సమానంగా వేగంగా పనులు చేసుకొనవలెను. లేనిచో జీవితమే వ్యర్థమగును.

5. అనియమము = నియమము కానిది, సుంత = కొంచెము; దీటు = సాటిలేని;

   **భావం:** నియమం తప్పక క్రమశిక్షణ పాటించుము. సాటిలేని గుణసంపదకు చక్కని సంస్కారానికి అదియే బాట అగును.

### ఆ. చర్చించండి-రాయండి.

1. కష్టం ఎదురైన చేయవలసినది.
2. చాలా విలువైనది.
3. సంస్కారానికి బాట.
4. గుణవంతుల లక్షణం
5. కార్య సాఫల్యం సిద్ధించాలంటే చేయవలసినది.
6. సకాలంలో పనులు చేయనిచో కలుగు ఫలితం.

## III. కృత్యం:

**పాఠ్యభాగంలోని కింది పద్యాలను చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.**

### అ. సరైన పర్యాయాన్ని ఎన్నుకోండి.

1. సంకటముల కెదురు నిలువ ________ తోడన్.

   సహనం | అసహనం

2. జయమును పొందిన ________


   కుంగరు | పొంగరు

3. ________ దుర్జనులతోడసలుపరు

   అంగడి | సంగడి

4. సంకోచంబున్న ________

   విడుపు | జడుపు



పద్యాలు: పాఠ్యభాగంలోని ఒకటవ, రెండవ పద్యాలు.

**ఆ. కింది పదాలను తగిన అర్థాలతో జతపరచండి.**

| | |
|---|---|
| 1. సంగటి | అ) భూమి |
| 2. ఇల | ఆ) భయము |
| 3. చిత్తము | ఇ) స్నేహము |
| 4. జంకు | ఈ) మనస్సు |

**ఇ. స్వీయస్పందన**

గుణవంతుల స్వభావాన్ని మీ సొంత మాటల్లో వ్యక్తీకరించండి.

- **చేసేపనికి ఫలితం లభించాలంటే ఏమేమికావాలి. ఏ వేవిచేయాలో ఆకృతిలో పూరించండి.**

పని

వెనుకంజవేయకుండుట

- **క్రమ శిక్షణద్వారా ఇవి అలవడతాయి.**

## IV. భాషావగాహన

**అ. గీతగీసిన పదాలు ఏ భాషాభాగానికి చెందినవో రాయండి.**

1. కాలమ్మాగదు నీకై చాలా
2. విలువైన దదియు సాగుము వడిగా

**ఆ. వ్యతిరేకపదాలు**

1) జయము X ______ 2) దుర్జనులు X ______ 3) సహనము X ______

4) విశ్వాసము X ______ 5) నిష్ఫలము X ______ 6) సంకోచం X ______


**ఇ. వచనము మార్చి రాయండి.**

1) గుణవంతుడు = ______ 2) సంకటము = ______

3) కార్యము = ______ 4) ఛాత్రుడు = ______

**ఈ. విభక్తులను గుర్తించండి.**

1. పొంగరు జయము ను పొందిన
2. సంగటి దుర్జనుల తోడ సలుపరు.
3. పాటించుము క్రమశిక్షణ
4. గుణ సంపదలకుధీటగు బాటది.



గ్రంథాలయ సమయం:

- వివిధ శతకపద్యాలను సేకరించి చదవండి
- వాటికి తగిన లైన్ డ్రాయింగ్ గీయండి.

**భాషాసౌందర్యం:**

## సభ్యవాక్కు

ఇతరులను నొప్పించే, ఇబ్బంది కలిగించే మాటలకు బదులుగా ఉపయోగించే సౌమ్యమైన సంస్కారవంతమైన పదాలను మాటలను **'సభ్యవాక్కు'**అంటారు. దీనిని ఇంగ్లీషులో Euphemisms అంటారు.

**ఉదా:** 1. 'చనిపోయాడు' అనడానికి బదులు

స్వర్గస్థులయ్యారు, దివంగతులయ్యారు, కీర్తిశేషులయ్యారు.

2. 'పాతది' అనడానికి బదులుగా 'వాడిన/ఉపయోగించిన' అని అంటాం.


ఉదా. వాడిన కారు (Used Car)

అలాగే ఇంట్లోగానీ, సమాజంలో గానీ ఇతరులకు ఇబ్బంది, చిరాకు కలగకుండా మెలగడాన్ని కూడా సంస్కారం అంటారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగించుకుంటున్న ఈ రోజుల్లో దానికి సంబంధించి కూడా సభ్యత పాటించవలసి యున్నది.

ఉదా: ఇతరులు పాస్‌వర్డ్‌లు వేయునపుడు చూడరాదు. వారి అనుమతి లేనిదే వారి కంప్యూటర్లు, ఫోన్లలో వ్యక్తిగత విషయాలు చదువుట/చూచుట చేయరాదు.

- ఇలాంటివెప్పుడూ చేయవద్దు.
1. గోళ్ళు కొరకడం.
2. తల గోకడం.
3. ముక్కులో వేలు పెట్టి కోవడం.

- **కవితలు అల్లుదామా!**




ఆహా! మామిడి పండు
రకాలనేక ముండు
తింటే తియ్యగ నుండు
పండ్లకే రారాజీ పండు